క్లుప్తంగా

వైఎస్సార్ బీమా సొమ్ము పంపిణీ



బాధిత కుటుంబానికి బీమా సొమ్ము అందజేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం 5వ వార్డు రాజబాబునగర్‌లో ఇటీవల గోరంత కొండ మృతి చెందాడు. గురువారం అతనికి వైఎస్సార్ బీమా సొమ్ము రూ.లక్ష మంజూరు కాగా మృతుడి భార్య ప్రశాంతి, తల్లి మార్త మ్మలకు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా ఆ సొమ్ము అందజేశారు. ఈ కార్యక్రమం మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద జరిగింది. ఆ వార్డు కౌన్సిలర్ అమలదాసు లోవరాజు, పెద్దలు తాతపూడి సుబ్బారావు, ఆకుమర్తి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ



పతకంతో కాకి రమ్యశ్రీ

రాయవరం: వెదురుపాక జెడ్పీ హెచ్ఎస్ విద్యార్థిని కాకి రమ్యశ్రీ జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించింది. ఈ విషయాన్ని పాఠశాల పీడీ నేతేటి కృష్ణప్రసాద్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 16 నుంచి 21 వరకు తెలంగాణ రాష్ట్రం మంచిర్యాలలో జరిగిన జాతీయ సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ద్వితీయ స్థానం సాధించిందన్నారు. తమిళనాడు రాష్ట్రంతో జరిగిన హోరాహోరీ పోటీలో త్రుటిలో ప్రథమ స్థానం చేజారిందన్నారు. భవిష్యత్తులో మరింత మెరుగ్గా రాణించి, ప్రథమ స్థానంలో నిలిచేందుకు కృషి చేస్తానని రమ్యశ్రీ తెలిపారు. ఆమెను సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి, పీఎంసీ చైర్మన్ సీహెచ్ సత్యనారాయణ, హెచ్ఎం వి.శాంతి సునీత తదితరులు అభినందించారు.

పారదర్శకంగా సర్వే రాళ్ల అమరిక



నల్లూరులో సర్వే రాళ్ల అమరిక పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సూర్యారావు

కపిలేశ్వరపురం: నల్లూరులో రామచంద్రపురం ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు భూముల రీసర్వే పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. తహసీల్దార్ కొమరం సూర్యారావు పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది వ్యవసాయ క్షేత్రంలో గురువారం సర్వే రాళ్లు అమర్చారు. ప్రాథమిక సర్వేలో నిర్ధారణకు వచ్చిన సరిహద్దుల ఆధారంగా రీసర్వేలో సర్వే రాళ్లను వేస్తున్నారు. త్వరితగతిన రీసర్వేను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్టు తహసీల్దార్ సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు. మండల, సచివాలయ సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



నల్లమిల్లి కాంతమ్మ, ఎస్ఎస్, రాంబాబులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా పెదపర్తి సర్పంచ్ నల్లమిల్లి కాంతమ్మ, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా అనపర్తికి చెందిన సత్తి శ్రీనివాసరెడ్డి (ఎస్ఎస్), పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడిగా వెంకటాపురానికి చెందిన మంగిన రాంబాబు నియమితులయ్యారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరిని ఎమ్మెల్యే పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. తమ నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యేను వారు సన్మానించారు. అనంతరం అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రంగంపేట జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, పార్టీ బిక్కవోలు మండల కన్వీనర్ పోతుల ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమేవ జయతే..

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు
- పటిష్టంగా పారిశుధ్య పనులు
- ఇంటింటా ఫీవర్ సర్వే ముమ్మరం



ఏడిదలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, ఈఓ వీర్రాజు

మండపేట: ఊరు బాగుంటేనే.. ఇల్లూ బాగుంటుంది. పరిసరాలు స్వచ్ఛంగా ఉంటేనే ఆరోగ్యానికి భరోసా ఉంటోంది.. ప్రస్తుత ప్రతికూల వాతావరణ పరిస్థితులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. దీంతో అధికార యంత్రాంగం ముందుగానే అప్రమత్తమైంది. వ్యాధుల కట్టడికి పల్లెలు, పట్టణాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేయిస్తోంది. దోమల నిర్మూలనకు ఆయిల్‌బాల్స్, యాంటీ లార్వా స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయిస్తుంది. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇంటింటా ఫీవర్ సర్వే ద్వారా జ్వర పీడితులను గుర్తించి అవసరమైన వారికి వైద్య సేవలు అందిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండపేట, రామచంద్రపురం పట్టణాలతో పాటు రూరల్ గ్రామాలు, రాయవరం, కపిలేశ్వరపురం, కాజులూరు, కె.గంగవరం మండలాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. జ్వరాల వ్యాప్తికి కారణమైన దోమల నిర్మూలనకు డ్రైన్లు, పల్లపు ప్రాంతాల్లో మందులను స్ప్రే చేయిస్తున్నారు. దోమల ఉధృతికి కారణమైన లార్వాను అరికట్టేందుకు డ్రైన్లలో యాంటీ లార్వా మందులు, ఆయిల్ బాల్స్ వేయిస్తున్నారు. అలాగే వీధుల్లో ఫాగింగ్ చేయిస్తున్నారు. రోజూ ఇంటింటా చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు వీధుల్లో ఎక్కడా చెత్త లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. తాగునీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేయిస్తున్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా వలంటీర్ల ద్వారా యజమానులకు అవగాహన కల్పిస్తున్నారు.

జాగ్రత్తలు వివరిస్తూ..

పగలు ఎండలు ముదురుతున్నాయి. రాత్రిళ్లు చలిగాలులు, మంచు ప్రభావం అధికంగా ఉంటోంది. వాతావరణ మార్పులతో వైరల్ జ్వరాల బాధితుల సంఖ్య పెరుగుతోంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వివిధ సమస్యలతో బాధపడుతున్నారు. మండపేట మండలంలో 2, రాయవరం మండలంలో 2, కపిలేశ్వరపురం మండలంలో 3 పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రధానంగా జలుబు, జ్వరం, దగ్గు, గొంతునొప్పి తదితర వ్యాధులతో ప్రజలు సతమతమవుతున్నారు. రోజుకు పది మంది వరకూ ప్రతి పీహెచ్‌సీకి జ్వరాలతో వస్తున్నారు.

అయితే జ్వర పీడితులను ముందుగా గుర్తించి వారికి అవసరమైన వైద్య సాయం అందించేందుకు వైద్య సిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వే చేస్తున్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచిస్తున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు జ్వరాలు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పిస్తున్నారు.

దోమల నివారణకు చర్యలు



మండపేట రూరల్ గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నాం. దోమలను అరికట్టేందుకు రోజూ పొగ మందు స్ప్రే చేయిస్తున్నాం. దోమలు వ్యాప్తి చెందకుండా డ్రైడే కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. డ్రైన్లలో పూడిక తీయిస్తున్నాం. ప్రజలూ పారిశుధ్య సమస్యలు రాకుండా సహకరించాలి.

–ఐ.రాజు, ఎంపీడీఓ, మండపేట

ఫీవర్ సర్వే చేయిస్తున్నాం



ప్రతికూల వాతావరణం, సెప్టిక్ ట్యాంకు గొట్టాలు డ్రైన్లలో పెట్టడంతో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి జ్వరాల వ్యాప్తికి కారణమవుతున్నాయి. జ్వర పీడితులను గుర్తించేందుకు ఇంటింటా ఫీవర్ సర్వే చేస్తున్నాం. ఇటీవల వేములపల్లిలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో డెంగీ కేసులు ఏమీ రాలేదు.

–ఎస్.సూర్యనారాయణరెడ్డి, మండల వైద్యాధికారి, ద్వారపూడి

ఈకేవైసీకి చొరవ చూపాలి

కాజులూరు: గ్రామాల్లో పంటలు సాగు చేస్తున్న రైతులంతా ఈకేవైసీ చేయించుకునేందుకు చొరవ చూపాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ తెలిపారు. గురువారం కాజులూరులో ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ రాయితీ, పంటల బీమా, సున్నా వడ్డీ పంట రుణాలు అందుతాయన్నారు. ధాన్యం విక్రయించేందుకు ఈకేవైసీ తప్పని సరిగా అవసరమవుతుందన్నారు. అన్ని ఆర్బీకేల్లో ప్రస్తుతం తమ సిబ్బంది ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కాజులూరు: గొల్లపాలెం 333/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలో పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ కాకినాడ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. గురువారం గొల్లపాలెం మెయిన్ సబ్ స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గొల్లపాలెం, ఆర్యావటం, శలపాక, తణుకువాడ, దేగలపేట, మొగలిపాలెం, శీల, మంజేరు, చేదువాడ, బందనపూడి, మతుకుమిల్లి, తర్లంపూడి, జగన్నాథగిరి, పెనుమళ్ల, అంద్రంగి, పెదపాటిగరువు గ్రామాలకు, కాజులూరు, తిప్పరాజుపాలెం, అయితపూడి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. కుయ్యేరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో దుగ్గదుర్రు, కుయ్యేరు, రేగుబడవ, చింతల్లంక, ఉప్పుమిల్లి తదితర గ్రామాలకు సరఫరా ఉండదని వివరించారు.

రామచంద్రపురం: స్థానికంగా ఫీడర్–1, 2 పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ తెలిపారు. చింతపల్లి సూరన్ననగర్, వీఎస్ఎం కళాశాల, చైతన్య రైస్‌మిల్లు, హౌసింగ్ బోర్డు, కమ్మవారి సావరం, ముచ్చుమిల్లి, కవలవారి సావరం, రత్నంపేట ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం కలుగుతుందన్నారు. బ్రాడీపేట, మార్కెట్ సెంటర్, చప్పిడివారి సావరం, కొవ్వగట్టు, లలితానగర్, గాంధీపేట, ఆర్డీఓ ఆఫీస్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు.

ముగిసిన మహా రుద్రయాగం



ప్రత్యేక అలంకరణలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి



హసన్‌బాదలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణమూర్తుల ఊరేగింపు

రాయవరం: సోమేశ్వరం గ్రామంలో చారిత్రక బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో పంచాయతన మహా రుద్రయాగం గురువారంతో ఘనంగా ముగిసింది. ఈ నెల 12న ఈ క్రతువు ప్రారంభమైంది. చంద్రాభట్ల రఘురామ శర్మ ఆధ్వర్యంలో వింజమూరి శ్రీరామసుబ్రహ్మణ్య శర్మ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ, కందర్ప కామేశ్వరశర్మ, వింజమూరి వీరభద్రం, పెద్దింటి శేషాచార్యుల సమక్షంలో వంద మంది వేద పండితులు ఈ రుద్రయాగాన్ని నిర్వహించారు. అనంతరం రుద్రయాగ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులకు ఘనంగా సత్కరించారు. రుద్రయాగానికి సహకరించిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. శుక్రవారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించనున్నారు. వేలాది మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లలో కమిటీ నిమగ్నమైంది.

వీరబ్రహ్మేంద్రస్వామి ఊరేగింపు

రామచంద్రపురం రూరల్: హసన్‌బాద గ్రామంలో వేంచేసి ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం కల్యాణ ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, గ్రామ పెద్దలు కాల్దారి వీరవెంకట బ్రహ్మానందాచారి, కాల్దారి బ్రహ్మం, చోడిశెట్టి భద్రరావు, కాకిలేటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం..



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బాపిరాజు, సుధాకర్ తదితరులు

మండపేట: చట్టసభలో తమ సామాజికవర్గానికి ప్రాతినిధ్యం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామని మాదిగ సామాజికవర్గ నాయకులు పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన బొమ్మి ఇజ్రాయేల్‌కు ఎమ్మెల్సీ సీటు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, పార్టీ నేత పలివెల సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎస్సీ కాలనీలో మాజీ ఉప ప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు. సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా బాపిరాజు, సుధాకర్ మాట్లాడుతూ గతంలో మాదిగలకు ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పి మాజీ సీఎం చంద్రబాబు మోసగించారన్నారు. సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యమన్నారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, నాయకులు ఉండ్రాసపు అర్జున్, బూర చిన్న, కొడమంచిలి భాస్కరరావు, గునిపె నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలని లేఖ

రామచంద్రపురం రూరల్: వెంకటాయపాలెంలో రైతుల భూమి శ్రీపైండా వెంకన్న రామకృష్ణయ్య సత్రం భూములతో పాటు ఒకే సర్వే నంబరులో ఉండటంతో నిషేధిత భూముల జాబితాలో ఉండి రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ అంశంపై మంగళవారం మండల ఉపాధ్యక్షురాలు నరాల రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో రైతులు జిల్లా దేవదాయ శాఖ అధికారి కేఎన్‌వీడీవీ ప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ వార్తను 'సాక్షి' దినపత్రికలో చూసిన పైండా జమిందార్ పైండా సుబ్రహ్మణ్య జగన్నాథ సత్యప్రసాద్ సానుకూలంగా స్పందించారు. గురువారం రైతులను కాకినాడకు పిలిపించి దేవదాయ శాఖ జిల్లా అధికారికి రైతుల సమస్య పరిష్కారం అయ్యేలా సర్వే చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ లేఖ రాసి రైతులకు అందజేశారు. దీంతో రైతులు పైండా జమిందారుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుడి మృతికి నివాళి

కె.గంగవరం: భట్లపాలిక శివారు రావిదొడ్డి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పొన్నమళ్ల ప్రసాద్ సంస్మరణ సభ గురువారం పాఠశాల ఆవరణలో జరిగింది. ప్రసాద్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎ.నాగరాజు, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు డి.విఘ్నేష్, నాయకులు ఎం.ప్రదీప్‌కుమార్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ దడాల దుర్గాభవాని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



అర్తమూరులో ఎదుర్కోలు ఉత్సవంలో బులిస్వామిరెడ్డి తదితరులు

మండపేట: అర్తమూరులో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజైన గురువారం స్వామివారి కల్యాణ వేడుకలో భాగంగా శ్రీవారి భక్త మండలి చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో ఎదుర్కోలు ఉత్సవం జరిగింది. తొలుత ఉదయం ఐదు వందల మందికి పైగా మహిళలు, మాలధారులు సప్తనదీ జలాలు, పంచామృత కలశాలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందనామ స్మరణతో వీధులన్నీ మార్మోగాయి. స్వామివారికి అభిషేకాల అనంతరం 108 బంగారు పుష్పాలతో అర్చన జరిగింది. తిరుమల నుంచి అర్చకస్వాములు తీసుకువచ్చిన 24 మూరల మేల్‌చాత్తు పట్టువస్త్రాన్ని స్వామివారికి అలంకరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సామూహిక కుంకుమార్చనలు, మధ్యాహ్నం స్వామివారి రథోత్సవం జరుగుతాయని బులిస్వామిరెడ్డి తెలిపారు. రాత్రికి స్వరార్చన, ఆలమూరుకు చెందిన ఆధ్యాత్మికవేత్త ముకుందేశ్వర స్వామివారితో అనుగ్రహభాషణ ఉంటాయన్నారు. ప్రధాన యాజమాన్య దంపతులు మల్లిడి హరినాథరెడ్డి, సుజాత, కర్రి బాపిరెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వలంటీర్ మృతి



రాజాబాబు (ఫైల్)

కె.గంగవరం: యండగండికి చెందిన వలంటీర్ కరపోతు రాజాబాబు (28) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. రాజాబాబుకు గత వారంలోనే వివాహమైంది. దీంతో భార్య, తల్లిదండ్రులు సత్యనారాయణ, అనంతలక్ష్మిలను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. గ్రామ సర్పంచ్ చోడే గోవిందరాజు, సచివాలయ కన్వీనర్ సాదే నారాయణరావు, పంచాయతీ కార్యదర్శి సీతారామయ్య, సహ వలంటీర్లు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

జీఎస్టీ పేరిట నోటీసులపై ఫిర్యాదు

మండపేట: ఢిల్లీలో జయశ్రీకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ పేరిట నిర్వహిస్తున్న సంస్థకు సంబంధించి జీఎస్టీ చెల్లించాలని ఢిల్లీలోని జీఎస్టీ కమిషనర్ నుంచి నోటీసులు రావడంపై ఆందోళనకు గురైన సేల్స్ రిప్రజంటేటివ్ గురువారం రూరల్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి కథనం మేరకు.. ఇప్పనపాడుకు చెందిన మదనపు కృష్ణ అవినాష్ ఇంటర్ చదువుకున్నారు. ద్వారపూడిలోని పరుపుల తయారీ పరిశ్రమలో సేల్స్ రిప్రజంటేటివ్‌గా పనిచేస్తున్నారు. కాగా ఢిల్లీలో తను కంపెనీని నిర్వహిస్తున్నానని, అందుకు జీఎస్టీ చెల్లించాలని రెండు నెలల కిందట నోటీసు వచ్చిందన్నారు. మొదట్లో పట్టించుకోలేదని తర్వాత తిరిగి నోటీసు రావడంతో అనపర్తికి చెందిన న్యాయవాదిని సంప్రదించగా తనకు తెలియకుండా తన ఆధార్ నంబర్ పేరిట దాదాపు రూ.రెండున్నర కోట్లు లావాదేవీలు జరిగినట్టు గుర్తించారన్నారు. ఈ విషయమై రూరల్ పోలీసులను సంప్రదించగా వారి సూచన మేరకు రాజమహేంద్రవరంలోని సంబంధిత అధికారులను కలసి ఫిర్యాదు చేయనున్నట్టు అవినాష్ తెలిపారు.

బహిరంగ చర్చకు సిద్ధమే

మండపేట: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచించినట్టుగానే ఆదివారం ఉదయం టిడ్కో ప్లాట్ల వద్ద తాను బహిరంగ చర్చకు వస్తానని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. టిడ్కో లబ్ధిదారుల సమస్యల పరిష్కారమే తన లక్ష్యమన్నారు.

వద్దంటే వినరేం..

- పంట కాలువలోకి సెప్టిక్ వ్యర్థాలు
- ఆందోళన చెందుతున్న రైతులు



మొగలిపాలెం రోడ్డులో కూరాడ కాలువలోకి వ్యర్థాలు వదులుతున్న సెప్టిక్ ట్యాంకర్

కాజులూరు: వద్దంటే వినడం లేదు.. కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.. కాజులూరు మండలం గొల్లపాలెంలో తరచూ పంట పొలాలు, కాలువల్లోకి సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు వదలుతున్నారు. దీనిపై అనేకమార్లు తాము చెప్పినా వినడం లేదని స్థానికులు, రైతులు అంటున్నారు. గొల్లపాలెం, ఆర్యావటంలలో సుమారు 10 సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకర్లు ఉన్నాయి. రోజూ కరప, కాజులూరు మండల గ్రామాల్లో సెప్టిక్ ట్యాంక్‌లు క్లీన్ చేసి వ్యర్థాలను మొగలిపాలెం రోడ్‌లోని వంతెన వద్ద పంట పొలాలు, కూరాడ కాలువల్లోకి వదులుతున్నారు. దీంతో కాలువ మురికి కూపంగా మారుతుందని, పూడిక తొలగింపునకు కూలీలు పనుల్లోకి రావటం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం నీటి ఎద్దడి నేపథ్యంలో కూరాడ కాలువ నుంచే ఆయిల్ ఇంజిన్ల ద్వారా పొలాలకు సాగు నీరు తోడుకుంటున్నామని, సెప్టిక్ ట్యాంకర్ల వ్యర్థాలతో ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. దీనిపై పలువురు రైతులు, స్థానికులు అడ్డుకోగా ట్యాంకర్ నిర్వాహకులతో వివాదాలు తలెత్తిన సంఘటనలు ఉన్నాయి. ఈ విషయంపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదులు చెయ్యగా పోలీసులు మందలించి పంపారు. అయినప్పటికీ పరిస్థితి మారడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

అటుగా వెళ్లలేకపోతున్నాం..



సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు వదలుతుండటంతో పంట కాలువలో నీరు కంపు కొడుతోంది. దుర్వాసన భరించలేకపోతున్నాం. కనీసం గట్లపై నుంచి కూడా వెళ్లలేకపోతున్నాం. పశువులు సైతం కాలువలో నీరు తాగేందుకు సాహసించడం లేదు.

–ద్వారంపూడి సోమిరెడ్డి, బందనపూడి

వీల్లేకుండా మారింది



సాగునీటి ఎద్దడి సమయాల్లో పంట కాలువలో నీటిని పంట పొలాలకు మోటార్లతో తోడుకునేవారం. సెప్టిక్ ట్యాంక్ నీళ్లు వదులుతుండడంతో కాలువ నీరు మురికిగా మారిపోయాయి. పొలాలకు నీరు తోడేందుకు వీలులేకుండా మారింది.

–పడాల వీరవెంకట సత్యనారాయణరెడ్డి, రైతు మొగలిపాలెం

అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం



బొబ్బిల్లంక వద్ద కాతేరు- సీతానగరం రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఏడాదిలో బొబ్బిల్లంక – ములకల్లంక బ్రిడ్జి పూర్తి
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ప్రణాళికాబద్ధంగా, నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ చేసే పనులు శాశ్వతంగా నిలుస్తాయని, నియోజకవర్గంలో అన్ని అభివృద్ధి పనుల్లో అదే విధానం పాటిస్తున్నామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. బొబ్బిల్లంక – ములకల్లంక బ్రిడ్జి, కాతేరు – సీతానగరం ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులను గురువారం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ములకల్లంక – బొబ్బిల్లంక బ్రిడ్జిని డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా ముందుకువెళుతున్నామన్నారు. గోదావరి వరదలు వచ్చేలోపు కనీసం పియర్ కాప్స్‌పై వేసే బీమ్‌ల వరకు పూర్తి చేస్తామన్నారు. వరద తగ్గుముఖం పట్టాక శ్లాబ్ వేయాలని ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ ఏడాదిలో పూర్తి చేస్తామని తెలిపారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

కాతేరు నుంచి సీతానగరం వరకు చేపడుతున్న నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులను ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులలో భాగంగా భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టంగా నిర్మించుకుంటూ వస్తున్నామన్నారు. కొన్నిచోట్ల సిమెంటు డ్రైనేజీల నిర్మాణం జరుగుతోందన్నారు. జూలై చివరకు రోడ్డు నిర్మాణాన్ని ఒక రూపానికి తీసుకువస్తామన్నారు.

త్వరలో కార్యరూపం దాల్చనున్న సీహెచ్‌సీ

సీతానగరం పీహెచ్‌సీ స్థానంలో నిర్మించనున్న 30 పడకల కమ్యూనిటీ ఆసుపత్రి త్వరలోనే కార్యరూపం దాల్చనుందని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నానని, బుధవారం ముఖ్యమంత్రిని కలిసి ఈ అంశాన్ని ఆయన దృష్టిలో ఉంచానని తెలిపారు. రఘుదేవపురం వద్ద రోడ్డును అనుకుని ఉన్న డీసీఎంఎస్ భూమిలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రతి మండలానికి కనీసం రెండు పీహెచ్‌సీలు ఉండాలని ప్రభుత్వం నిర్ణయించిందని, సీతానగరం పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మారుతున్నందున బొబ్బిల్లంకలో రూ 1.50 కోట్లతో పీహెచ్‌సీ ఏర్పాటుచేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. ఆయన వెంట ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సర్పంచ్ మెల్లిమి రామచంద్రరావు, కాటవరం ఎంపీటీసీ తాడేపల్లి వెంకట్రావు, పార్టీ నాయకులు మద్దిపాటి సుబ్బారావు, మల్లిన చౌదరి, ఆర్అండ్‌బీ డీఈ మధుసూదనరావు, ప్రాజెక్ట్ డీఈ ధర్మరాజు, బ్రిడ్జి కాంట్రాక్టర్ విశ్వేశ్వరరావు ఉన్నారు.

బ్యాంకు లింకేజీ రుణాలతో ప్రగతి సాధించాలి

రాజానగరం: బ్యాంకు లింకేజీ రుణాలతో జీవనోపాధిని మెరుగుపర్చుకుని ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధిని సాధించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సుభాషిణి పిలుపునిచ్చారు. మండలంలోని శ్రీరామపురంలో గురువారం నిర్వహించిన స్వయం సహాయక సంఘాల సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, సకాలంలో తిరిగి చెల్లింపులు జరిగితే మరి కొందరికి పరోక్షంగా సహాయపడిన వారవుతారన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలను అనుసరించి, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను ఏవిధంగా వినియోగించుకుంటున్నారు, తద్వారా వారి ప్రగతి ఏవిధంగా ఉంటుంది అనే విషయాలను పరిశీలించడంలో భాగంగా ఈ సమావేశం నిర్వహించారు. ఆయా సంఘాల పనితీరు, వ్యాపార లావాదేవీలు, మార్కెటింగ్ సదుపాయాలు, యూనిట్లు/రికార్డుల నిర్వహణ, కుటుంబ సభ్యుల స్థితిగతులను ఆరా తీశారు. ఈ సమావేశంలో బ్యాంకు లింకేజీ డీపీఎం గణేష్, ఏపీఎం హేమనాగలక్ష్మి, సీసీ కన్నబాబు, సీసీఎస్సీ సింహాచలం, అకౌంటెంట్ నాని, వీఓఏ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా 'నాడు- నేడు' పనులు

కపిలేశ్వరపురం: వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. నాడు–నేడు రెండో విడత రూ.24 లక్షల నిధులతో ఈ పనులు సాగుతున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ మందపాటి కల్యాణి, హెచ్ఎం లక్ష్మణరావు ఆధ్వర్యంలో గురువారం తరగతి గదుల పునాది నిర్మాణ పనులు జరిగాయి. తరగతి గదులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని జేఈ తెలిపారు.